

ఆదిలక్ష్మీనారాయణుల కల్యాణం

పాత గుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కల్యాణం కనులపండువగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం 513.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



జైలులో ఓపెన్ టెన్త్ పరీక్షలు

పట్నంబజారు: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జిల్లా జైలులో సోమవారం నిర్వహించినట్లు గుంటూరు జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి కె.రఘు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
గుంటూరు	6.24	4.55
నరసరావుపేట	6.26	4.58
బాపట్ల	6.24	4.56

న్యూస్‌రీల్

నేడు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులకు గ్రీవెన్స్

నరసరావుపేట: స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వేతనాలకు సంబంధించిన సమస్యలు ఉన్న వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని వ్యక్తిగతంగా కలసి వినతిపత్రాన్ని అందజేయాలని సూచించారు. జిల్లాలో వచ్చిన వినతులన్నింటిని సమీకరించి విజయవాడలోని ప్రజారోగ్య డైరెక్టర్‌కు అందజేయనున్నట్లు వివరించారు. వేతన సమస్యలపై వినతులు సమర్పించేందుకు ఉద్యోగులు, ఉద్యోగసంఘాల ప్రతినిధులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు.

మిర్చి రైతులు తక్‌పట్టి తీసుకెళ్లాలి

కొరిటిపాడు(గుంటూరు): ఎన్నికల నిబంధనలు దృష్ట్యా మిర్చి రైతులు నగదు తీసుకెళ్లే సమయంలో తక్‌పట్టి తీసుకెళ్లాలని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు, గుంటూరు మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధారం లేకుండా అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లడం ఉల్లంఘన కిందకు వస్తోందని హెచ్చరించారు. మిర్చి విక్రయించిన రైతులు కమీషన్ వ్యాపారి వద్ద నుంచి తప్పనిసరిగా తక్‌పట్టిని పొందాలని సూచించారు.

యార్డులో 1,35,164 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,35,164 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,28,403 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.19,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,046 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: వేసవి సెలవులలో చిన్నారులలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మే నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని వివరించారు. శిబిరంలో 8 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసు ఉన్న బాలబాలికలకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శిబిరంలోనూ 25 మంది బాలికలు, 25 మంది బాలురుతో ఏర్పాటు చేసిన శిబిరంలో నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు తమ వివరాలను ఈనెల 26వ తేదీలోగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, అధికారికి తెలియజేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులు తమ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వద్ద నుంచి ధ్రువపత్రం తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. వివరాలకు 8212622574 లో సంప్రదించాలని కోరారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5500, మోడల్ ధర రూ.4700 వరకు పలికింది.

వార్ ట్రయల్ రన్ వే







కదన రంగంలో గగనం నుంచే భీకరదాడులు చేసి శత్రువులను గడగడలాడించే విమానాలు హైవేపై పరుగులు తీశాయి. సోమవారం బాపట్ల జిల్లా కొరిశపాడు సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఎమర్జెన్సీ ల్యాండ్ అయ్యాయి. అత్యవసర సేవలతో పాటు, సైనిక అవసరాలకు ఉపయోగపడేలా పి.గుడిపాడు, సింగరాయకొండ సమీపంలో ప్రత్యేక రన్‌వేలు నిర్మించారు. గతంలో దిగకుండా విమానాలతో ట్రయల్ రన్ నిర్వహించగా, రన్‌వేపై విమానాలు దించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఎయిర్ ఫోర్స్ అధికారులు, ఉదయం నుంచే కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున భద్రతా చర్యలు చేపట్టారు. భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ 30, జెట్ ఫైటర్ హాక్ కార్గో విమానాలు ఏఎన్ 32, డోర్నియర్ విమానాలు ఇలా.. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రహదారిపై దిగి సందడి చేశాయి. రాడార్ వాహనంతో పాటు అత్యాధునిక సాంకేతిక వాహనాలను రన్‌వే సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆశ్రమంలో ఉంచారు. ట్రయల్ రన్ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. – ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

నిబంధనలు పకడ్బందీగా అమలు

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- రాజకీయపార్టీ ప్రతినిధుల సమావేశం

నరసరావుపేట: ఎన్నికల నిర్వహణలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రకటన విడుదల అనంతరం జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డితో కలసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. సి-విజిల్ యాప్ అందరూ డౌన్‌లోడు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి చేసిన ఎంసీసీ, సీ-విజిల్, అభ్యర్థుల నామినేషన్లు వివరాలు, మోడల్ కాండక్ట్ ఆఫ్ కోడ్ ఎన్నికల విధులకు మొత్తం సుమారు 156 టీములు పనిచేస్తున్నాయని వివరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పాటించాల్సిన ప్రభుత్వ విధానాలను, ఎన్నికల కమిషనరేట్ విధులను వివరించారు. జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఊరేగింపులు ప్రచారాలు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతి ఇస్తామని చెప్పారు. నిబంధనలు మేరకు జెండాలని వినియోగించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు సమావేశాలు, ర్యాలీలకు ముందుగానే అనుమతి తీసుకోవాలని కోరారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రింటింగ్ చేసే మాటర్, ఎన్ని కాపీలు వేసేది, వాటి వివరాలను ఆఫీసుల్లో అందజేయాలని ఆదేశించారు. ఆర్టికల్స్, మద్యం, డబ్బులు సీజ్ చేసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అందించాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా కాల్ సెంటర్ నుంచి వచ్చే ఫిర్యాదులు వంద నిమిషాల్లో జిల్లా అధికారులకు పంపాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ట్రైనీ జిల్లా కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా డీఆర్వో కె.వినాయకం వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్(ఐ) ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు.

అత్యవసర సేవలు కొనసాగుతాయి..

సార్వత్రిక ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకర్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికలు రిటర్నింగ్ అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. వలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని చెప్పారు. నిబంధనల అమలులో 0.1 శాతం వ్యత్యాసం ఉండరాదన్నారు. దినపత్రికల్లో వచ్చే వార్తలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీ-విజిల్ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడు చేసుకోవాలని, ఆ యాప్‌లో వచ్చే అంశాలను వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు ద్వారా తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీ-విజిల్ నోడల్ అధికారి రామకృష్ణ యాప్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎక్కడుందో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న అత్యవసర సర్వీసులను కొనసాగించవచ్చని అన్నారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

బఫే పద్ధతిలో దుర్గమ్మ అన్నప్రసాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అమ్మవారి అన్న ప్రసాదం అందేలా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాద వితరణ ప్రాంగణానికి విచ్చేసిన భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండకుండా నేరుగా ప్రసాద వితరణ హాల్‌లోకి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి నిత్యం అమ్మ వారి దర్శనానికి సుమారు 30 వేల నుంచి 40 వేల మంది భక్తులు విచ్చేస్తుంటారు. సాధారణ రోజులలో నాలుగు వేల మందికి, శుక్ర, శని, ఆదివారాలలో రోజుకు ఐదు వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ జరుగుతుంది. మహా మండపం మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రావడంతో పాటు దానిని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు.

బీసీలకు టీడీపీ తీవ్ర అన్యాయం

- సామాజిక న్యాయం మాటల్లోనే... చేతల్లో లేదు
- 50శాతం ఉన్నా ఓటు బ్యాంకుగానే చూస్తున్న టీడీపీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో యాదవులకు సీటు కేటాయించాలి
- మంగళగిరిలో లోకేష్ వెనక్కి తగ్గి యాదవులకు అవకాశం కల్పించాలి
- టీడీపీలో డబ్బు సంచులు తెచ్చే వారికి సీట్లు కేటాయింపు
- శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు



ప్లకార్డు ప్రదర్శిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీసీలకు ఒక్క సీటు కేటాయించలేదని శ్రీకృష్ణ యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1983 టీడీపీ ఆవిర్భావం నుంచి 40 ఏళ్లలో ఇప్పటి వరకు 180 మంది ఎమ్మెల్యేలు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎన్నికయ్యారు. వారిలో యాదవ, వడ్డెర, రజక, పద్మశాలి వంటి ఇతర బీసీలకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా లేకపోవడం బాధాకరమన్నారు. పదేళ్ల నుంచి తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలకు ఒకే కులానికి, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకే సీట్లు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం అని చెప్పుకునే టీడీపీ, బీసీలకు సీట్లు కేటాయించాలనే ఆలోచన లేదా.. బీసీల్లో అత్యధికంగా ఉన్న కులాలు మీకు కనిపించడం లేదా? ఇదేనా మీరు చెప్పే సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. సింగపూర్ తరహాలో రాజధాని నిర్మిస్తాం, సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుందాం అని చెప్పే చంద్రబాబుకు సింగపూర్ దేశంలో సామాజిక న్యాయం పాటిస్తున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. అక్కడి ప్రభుత్వం సామాజిక సమతుల్యత కల్పిస్తారు. అక్కడ ఏ విధంగా సోషల్ జస్టిస్ అమలు చేస్తున్నారో... ఇక్కడ సీట్ల కేటాయింపులో కూడా సోషల్ జస్టిస్ కల్పించాలని డిమాండ్ చేశారు.

లోకేష్ వెనక్కి తగ్గాలి..

అమెరికాలో చదువుకున్న లోకేష్‌కి సామాజిక న్యాయం పాటించాలని తెలియదా? వైఎస్సార్ సీపీ సామాజిక న్యాయం పాటిస్తూ మంగళగిరిలో బీసీలు ఎక్కువగా ఉంటారని బీసీ మహిళకు సీటు కేటాయిస్తే అక్కడ నువ్వు ఏవిధంగా పోటీ చేస్తావని లోకేష్‌ను ప్రశ్నించారు. బీసీ మహిళపై ఓసీ అయిన నువ్వు పోటీ చేయడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. లోకేష్ మంగళగిరి సీటును విత్‌డ్రా చేసుకుని తెనాలి, పొన్నూరుకు వెళ్లాలని హితవు పలికారు. అక్కడ వైఎస్సార్ సీపీ బీసీలకు సీటు కేటాయించింది కాబట్టి బీసీ యాదవులకు సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుంటూరులో ఎంతో కాలం పార్టీ కోసం కష్టపడిన నాయకులు పేదల డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ నిమ్మల శేషయ్య మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో యాదవులకు ఒక్క సీటైన కేటాయించాలని లేని పక్షంలో కురుక్షేత్రమే అన్నారు. గెలుపు గుర్రాలకు కళ్లెం వేసి తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలంతా ఏకమవుతామన్నారు.

మీ కోసం యాదవులు ప్రాణ త్యాగాలు చేయాలా?

లోకేష్ పాదయాత్ర చేసే సమయంలో ఎవరిపై ఎన్ని కేసులుంటే వారికి నామినేటెడ్ పోస్టులు, పదవులు ఇస్తామన్నారు. లోకేష్ వ్యాఖ్యలకు పల్నాడులో యాదవులు ఇద్దరు పార్టీ కోసం పనిచేసి హత్యకు గురయ్యారు. ఇప్పుడు సీట్లు కేటాయించిన వారిలో ఎవరిపై ఎన్ని కేసులు ఉన్నాయని సీట్లు కేటాయించారని ప్రశ్నించారు. మీ పల్లకీలు మోసేందుకు యాదవులు కావాలి. మీకు మాత్రం యాదవులు కనిపించడం లేదా అని నిలదీశారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు తోట కోటేశ్వరరావు, దాసరి శివకుమార్, ఉగ్గం సాంబశివరావు, పి.సత్యనారాయణ, డి.కళ్యాణ్, అలా రవి, కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఆర్జేడీ
- తొలిరోజు 638 మంది గైర్హాజరు



మున్సిపల్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



పది పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవటం ప్రారంభించారు. తొలిరోజు కావటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు రావటంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 127 పరీక్ష కేంద్రాలలో 25,749 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 25,111 మంది హాజరయ్యారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. అలాగే రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిధిలోని ఏడు కేంద్రాలను సందర్శించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. వసతులు పరిశీలించారు.

ఆంధ్రా అమ్మాయి... జవహర్‌నగర్ మేయర్

- ముత్తాయపాలేనికి చెందిన శాంతి
- సోమవారం మేయర్‌గా ప్రమాణ స్వీకారం
- ఆనందంలో గ్రామస్తులు



శాంతి

బాపట్ల టౌన్: బాపట్ల మండలం, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పమిడిబోయిన శాంతి తెలంగాణ రాష్ట్రంలోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎంపికయ్యారు. ఆమె బాపట్ల మండలం, ముత్తాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్య అభ్యసించారు. 2000లో తెనాలి మండలం, దావులూరిపాలెం గ్రామానికి చెందిన కోటేష్‌గౌడ్‌తో వివాహమైంది. గడిచిన 20 సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 18వ డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ కార్పొరేటర్లంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ముత్తాయపాలెం గ్రామానికి చెందిన మహిళ శాంతి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హనుమంత వాహనంపై శ్రీవారి దర్శనం





హనుమంతవాహనంపై నారసింహుడు, ఉత్సవానికి హాజరైన భక్తులు

అభయప్రదాత భుజస్కందాలపై నారసింహుడు

మంగళగిరి: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు సోమవారం రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అభయప్రదాత అయిన హనుమంతుని భుజస్కంధాలపై శ్రీ లక్ష్మీ నారసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని తిలకించిన భక్తులకు స్వామి వారు సద్బుద్ధిని అభయాన్ని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం. ప్రతి ఒక్కరికి సద్బుద్ధిని, అభయాన్ని ప్రసాదించి భక్తుల కోసమే స్వామి ఉంటారనే అభయాన్ని ఉత్సవం కల్పిస్తుంది. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించగా దుగ్గిరాల మండలం పెదపాలేనికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు(రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆదివారం రాత్రి రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హనుమద్వైభవం ప్రవచనం, అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి నృత్యాలు మిమిక్రీలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు రాజాధిరాజ వాహనంపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు రాజాధిరాజ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి వారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఏఓ కోరారు.

క్లుప్తంగా

భార్యపై దాడి చేసిన భర్తకు తొమ్మిదేళ్ల జైలు

సత్తెనపల్లి / అమరావతి : భార్యపై దాడి చేసిన భర్తకు తొమ్మిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు అపరాధ రుసుం విధిస్తూ సెషన్స్ జడ్జి డీ.నాగ వెంకటలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కోట అర్జున్, అదే గ్రామానికి చెందిన మేరీలకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇరువురు కుమారులు ఉన్నారు. భర్త అర్జున్ చెడు వ్యసనాలకు బానిసై భార్య మేరీని శారీరకంగా, మానసికంగా వేధించటం ప్రారంభించాడు. దీంతో మేరీ రెండు పర్యాయాలు అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దలు భార్యా, భర్తల మధ్య రాజీ చేశారు. అయినప్పటికీ అర్జున్‌లో ఎలాంటి మార్పు రాకపోవడంతో మేరీ గ్రామంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండేళ్ల క్రితం అర్ధరాత్రి సమయంలో మేరీ నివసిస్తున్న ఇంటికి పైకి వెళ్లిన అర్జున్ ఆమె తల వెనుక భాగంలో కొట్టి గాయపరిచాడు. ఆ సమయంలో కుమారుడు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ లెక్క చేయలేదు. దీంతో తీవ్ర గాయాల పాలైన మేరీ అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ డీ.వెంకటేశ్వర్లు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. సాక్షులను అమరావతి సీఐ అవ్వారు వెంకట బ్రహ్మం సకాలంలో కోర్టుకు హాజరు పరచగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డీ.నాగ వెంకటలక్ష్మి తీర్పు వెలువరించారు.

ఓటీటీలపై నిషేధం ప్రజాస్వామ్య పరిరక్షణే

తెనాలిరూరల్: విచ్చలవిడి శృంగారాన్ని చూపిస్తున్న 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను కేంద్ర ప్రభుత్వం తాజాగా నిషేధించడం దేశ ఆచార సంప్రదాయాలను గౌరవించడమేనని 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరులోని ఆయన స్టూడియోలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆయా ఓటీటీలకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను కూడా బ్లాక్‌లో పెట్టి మితి మీరిన శృంగారాన్ని అదుపులో పెట్టె ప్రయత్నాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ చేసిందన్నారు. దీనివలన 57 సోషల్ మీడియా ఖాతాలు, 19 వెబ్ సైట్లు, 10 యాప్‌లను భారతదేశంలో ఇక నుంచి చూడలేరని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఎన్నో పర్యాయాలు తాను కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్‌కు స్వయంగా మొరపెట్టుకున్నానని అలాగే ప్రసారభారతి సీఇఓకు లిఖిత పూర్వకంగా మా–ఏపీ తరపున కోరినట్లుగా దిలీప్ రాజా తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

- జాయింట్ కలెక్టర్ ప్రసాద్
- వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష

మాచర్ల రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ శ్యాం ప్రసాద్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మే 13న జరగనున్న పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, రాజకీయ పార్టీలు పాటించాల్సిన కేంద్ర ఎన్నికల నియమావళిపై ఆయన చర్చించారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని రాజకీయ పార్టీలు అధికారులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన అధికారులపై చర్యలు



ప్రజా ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ ప్రసాద్

తప్పవని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు తమ విధులను నిర్వహించాలని కోరారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, ఎన్నికల డీటీ షేక్ బాషా, ఏఎస్ఓ ప్రభాకర్, ఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, సీపీఎం, బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన నాయకుడు నీరుకొండ

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీలో చేరిక

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ స్పీడుకి ప్రతిపక్షాలు కుదేలవుతున్నాయి. ఇటీవల భారీగా వలసలు పెరగడంతో టీడీపీ ఇప్పటికే పూర్తి నైరాశ్యంలో కూరుకుపోయింది. అదేబాటలో జనసేన పార్టీ నడుస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును వ్యతిరేకిస్తూ చాలా మంది ముఖ్య నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో జనసేనకు క్రియాశీలకంగా ఉన్న క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన నీరుకొండ రామారావు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అనైతికమని ఆ పార్టీ కార్యకర్తలు గ్రహించారన్నారు. అందుకే రెండు పార్టీల నుంచి అనేక మంది వైఎస్సార్



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకుడు నీరుకొండ

సీపీలో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో కాపులకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోనూ కాపులకు సముచిత స్థానం కల్పించామన్నారు. అందుకే ఆ సామాజికవర్గం నుంచి సైతం వైఎస్సార్ సీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గల్లా గురుపాదం, ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.

మారథాన్ పోటీల్లో మెరిసిన వినుకొండ క్రీడాకారుడు

5 కిలోమీటర్ల మారథాన్ రన్ విభాగంలో బంగారు పతకం కైవసం

వినుకొండ (నూజండ్ల): విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ మైదానంలో ఆదివారం నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్ భారత్ నివేష్ రన్ పోటీలలో వినుకొండ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా పాల్గొని బంగారు పతకం సాధించడం పట్ల పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు, డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వలంపిక్స్ శిక్షణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తనకు విషయం తెలుసుకున్న పలువురు దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తామని



బంగారు పతకం సాధించిన క్రీడాకారుడు

తెలియచేయడం జరిగిందని క్రీడాకారుడు అబ్దుల్లా పేర్కొన్నారు. దాతల ప్రోత్సాహంతో భారత్ తరుపున వలంపిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమన్నారు.

అమరేశ్వరుని సన్నిధిలో 'అమరేశ్వరం' గ్రంథావిష్కరణ

అమరావతి: అమరేశ్వరాలయంపై భక్తుల హృదయాలలో కలిగే అనుమానాస్పద భావనలకు 'అమరేశ్వరం' గ్రంథం సంపూర్ణ సమాధానంగా నిలుస్తుందని అమరేశ్వరాలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపినాథ శర్మ అన్నారు. సోమవారం రాత్రి అమరేశ్వరాలయంలో పాపయారాధ్య సాహితీ కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యకటక విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు రచించిన 'అమరేశ్వరం' పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జ్యోతిష్య విశారద శనగవరపు రామ్మోహన శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపినాథ శర్మ మాట్లాడుతూ అమరేశ్వరాలయ నిర్మాణ శైలిని, ఆనాటి ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను పరిశోధన చేసి నేటి తరాలకు అందించే ప్రయత్నం చేసిన గ్రంథకర్త డాక్టర్ వావిలాల సుబ్బారావు సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. బౌద్ధ స్థూపం కూల్చి ఆలయం నిర్మించారనే కోట్లాది మంది ప్రజలలో నెలకొన్న అనుమానాలకు అమరేశ్వరాలయంలోని సుమారు 38 శాసనాలను నిరంతరం అధ్యయనం చేసి గ్రంథం ద్వారా తగిన వివరణ ఇచ్చారన్నారు. ఎన్నో వ్యవ ప్రయాసలకు ఓర్చి పరిశోధనాత్మక వివరణ ఇచ్చి భక్తుల నమ్మకాన్ని మరింత పెంచిన వావిలాల సుబ్బారావుకు దేవదాయ శాఖ, అమరేశ్వరాలయం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ సాహితీ వేత్త ప్రఫుల్లారాణి మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారావు సుమారు 38 శాసనాలను అధ్యయనం చేసిన పిదప ఈ ఆలయానికి సుమారు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు ప్రామాణికంగా నిరూపించటం గొప్ప విషయమన్నారు. గ్రంథకర్త డాక్టర్ వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ అమరేశ్వరాలయంలో శాసనాలను అధ్యయనం చేయటంతో పాటు వాటిని గ్రంథస్థం చేయటానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



'అమరేశ్వరం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కానిస్టేబుల్ భర్తపై భార్య ఫిర్యాదు

నగరంపాలెం: భర్త వేరొకరితో ఉంటూ తమను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో సోమవారం జరగాల్సిన స్పందనను తాత్కాలికంగా రద్దు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లైతే పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 86888 31568కు ఫోన్‌లోగానీ, వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చునని ముందస్తుగా ప్రకటించారు. అయితే కొల్లిపర మండలం చివలూరు గ్రామానికి చెందిన పి.ఝాన్సీ రాణి, కుటుంబ సభ్యులతో కలసి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. డీపీఓ ఎదుట న్యాయం చేయాలి అంటూ ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేశారు. 2016లో పోలీస్ కానిస్టేబుల్‌తో పెళ్లి జరిగిందని, ప్రస్తుతం అతను ఉత్తర సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు పిల్లలు సంతానం. కొద్దికాలంగా తాడేపల్లి అంజిరెడ్డినగర్‌కు చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని తమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని పేర్కొంది. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, భర్త వద్ద ఉన్న చిన్న కొడుకుని అప్పగించి, న్యాయం చేయాలని ఆమె కోరింది.

పరీక్ష కేంద్రం పరిశీలన

తెనాలిఅర్బన్: పట్టణంలోని ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్, కేఎస్‌ఎం హైస్కూల్ పరీక్ష కేంద్రాలను , పలు ప్రవేట్ పాఠశాలలను పరీక్షల రాష్ట్ర పరిశీలకులు పార్వతీ సోమవారం పరిశీలించారు. ఆమెకు మౌలిక వసతులు కల్పనకు ఎంఈఓ లక్ష్మీనారాయణ వివరించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ (దూరవిద్య) పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయినట్టు జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షకు 1,117 మంది హాజరు కావలసి ఉండగా 1,009 మంది హాజరయ్యారని చెప్పారు. 108 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 2,079మంది హాజరు కావలసి ఉండగా 1,931మంది హాజరై, మరో 148 మంది గైర్హాజరైట్టు వెల్లడించారు.

20 నుంచి ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలను ఈ నెల 20 నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రిలోని క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గత రెండు నెలల నుంచి టీబీ సెంటర్‌లో గుండె జబ్బుల ఓపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, గుండె జబ్బుల ఓపీని సిద్ధం చేశామని వెల్లడించారు. అందులో భాగంగా టీబీ సెంటర్‌ను వేరే చోటకు తరలించి ఇక్కడ గుండె జబ్బుల ఓపీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా ఈటీబీ కేంద్రాన్ని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మారుస్తున్నామని తెలిపారు. గుండె జబ్బుల ఓపీ విభాగం వైద్యులకు, రోగులకు అందుబాటులో ఉండేవిధంగా ఆరు గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. గుండె జబ్బుల ఓపీ ప్రస్తుతం పదో నెంబర్ ఓపీలో ఉండేదని, వారంలో కేవలం మూడు రోజుల మాత్రమే పని చేసేదన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ సేవలను విస్తరిస్తున్నామన్నారు. గుండె జబ్బుల వార్డులో స్కానింగ్ పరీక్షలు ఉండటం వల్ల రోగులు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని స్కానింగ్ కూడా నూతన ఓపీలో ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటారని అందువల్ల ఈ ఓపీలో అన్ని రకాల పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గుండె జబ్బుతో బాధపడే రోగులు రోజుకు మూడు నుంచి 400 మంది వస్తుండటం వల్ల ప్రత్యేక ఓపీని కేటాయించినట్లు చెప్పారు. గుండె జబ్బుతో బాధపడే రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

టీబీ సెంటర్ మార్పు..

ఆసుపత్రిలోని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని పూర్తిగా ఉపయోగంలోకి తీసుకుని వచ్చామని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ భవనంలో క్షయ నియంత్రణ కేంద్రాన్ని మారుస్తున్నామని ఆయన చెప్పారు. ఇక నుంచి ఈ భవనంలోనే పూర్తిస్థాయిలో క్షయ నియంత్రణ కేంద్రం పని చేస్తుందన్నారు. సూపరింటెండెంట్ వెంట జింకానా అధ్యక్షుడు డాక్టర్ పాదిల ప్రసాద్, డెప్యూటీ కలెక్టర్ సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ తెలిపారు. పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని ఆమె సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలోని విద్యార్థులు, పాఠకులతో మాట్లాడి గ్రంథాలయ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరికి అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యర్థులు ఏవైనా పుస్తకాలను సూచించి నట్టయితే వాటిని కూడా తెప్పించి అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న వేసవిలో విద్యార్థులు అధిక సంఖ్యలో గ్రంథాలయాలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మను సత్కరిస్తున్న సిబ్బంది

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- జేసీ రాజకుమారి
- రాజకీయ పార్టీలతో సమావేశం

మంగళగిరి: రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని లేదంటే నిబంధనలను ప్రకారం చర్యలు తీసుకుంటామని మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలను వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలన్నారు. ప్రైవేటు భవనాలపై రాజకీయ పార్టీలు ప్రచార బోర్డులు పెట్టుకోవాలంటే యజమాని అనుమతి తప్పనిసరిగా అధికారులు తీసుకోవాలన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అన్ని పార్టీలకు ఒకే మాదిరిగా ఎన్నికల నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నిబంధనలు అమలులో సమన్యాయం పాటిస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించి ఎన్నికలలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఫిర్యాదులు వచ్చిన అధికారులు సిబ్బందిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీఐ బి.శ్రీనివాసరావు, డీడీ రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, కరిముల్లా, గౌస్ పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక అధికారులపై దాడి

ఫిర్యాదు చేసిన అధికారులు.. కేసు నమోదు



అధికారులపై దాడికి పాల్పడుతున్న కిషోర్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుండగా, పట్టణ ప్రణాళికా అధికారులు అడ్డుకోవడంతో అధికారులపై భౌతికంగా దాడిచేసి, దుర్భాషలాడిన సంఘటనపై నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, పట్టణ ప్రణాళిక డెప్యూటీ సిటీప్లానర్ మురళీ తెలిపిన వివరాల ప్రకారం నగర శివారులోని గోరంట్ల మైత్రినగర్ ఇన్నర్ రింగ్‌రోడ్డులో 50/89 లే అవుట్‌లో ఓపెన్ స్పేస్ ఉంది. అందులో గోరంట్లకు చెందిన తాళ్ల కిషోర్‌కుమార్, మరికొందరు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారన్న సమాచారం మేరకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా అధికారులు, ప్లానింగ్ కార్యదర్శుల బృందం అక్కడకు చేరుకున్నారు. దీంతో కిషోర్‌కుమార్ అధికారులను అడ్డుకుని, వారిపై దాడి చేసి, దుర్భాషలాడారు. ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకున్నందుకు పట్టణ ప్రణాళికా అధికారులు కిషోర్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఆక్రమణలకు పాల్పడే వారు ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గోరంట్ల ఇన్నర్‌రింగ్‌రోడ్డులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిని అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై దాడికి పాల్పడి, దుర్భాషలాడిన సంఘటనపై నగర కమిషనర్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకుని వారిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా క్షమించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– నగర కమిషనర్ కీర్తి చేకూరి

'ఎసెంట్రిక్స్ టెక్ ఫెస్ట్' పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 1న 'ఎసెంట్రిక్స్ టెక్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్టు కళాశాల విభాగాధిపతి డాక్టర్ ఏ.గంగాధర తెలిపారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఫెస్ట్ పోస్టర్‌ను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైయస్ కిషోర్‌బాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.గంగాధర, ఫెస్ట్ సమన్వయకర్తలు ఎస్‌వీ సాయిప్రసాద్, వై.నవీన్‌కుమార్, విద్యార్థి సమన్వయకర్తలు కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో ఐవోటీ, వీఎల్ఎస్ఐ వర్క్‌షాప్, టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహిస్తామని తెలిపారు. బీటెక్, డిప్లొమా, డిగ్రీ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్రిపుర సుందరి మృతికి సీపీఎం సంతాపం

సాక్షి, అమరావతి: సీపీఎం అగ్రనాయకుడు మాకినేని బసవపున్నయ్య కోడలు త్రిపుర సుందరి మృతి పట్ల సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. మాకినేని త్రిపుర సుందరి అనారోగ్యంతో సోమవారం హైదరాబాదులో మృతి చెందారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకురాలు డి.రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. త్రిపుర సుందరి వైద్యురాలిగా ప్రజా సేవ చేయడంతోపాటు జీవిత చరమాకం వరకు కమ్యూనిస్టు అభిమానిగా ఉన్నారని పేర్కొన్నారు. రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో జన్మించిన త్రిపుర సుందరి గుంటూరు మెడికల్ కాలేజీలో డాక్టర్ చదివి గైనిక్‌లో స్పెషలైజేషన్ చేశారన్నారు. నెల్లూరు ప్రజా వైద్యశాలలో నాలుగు సంవత్సరాలు పనిచేశారన్నారు. మాకినేని బసవపున్నయ్య కుమారుడు జశ్వంత్‌ను వివాహం చేసుకుని గుంటూరు సాంబశివపేటలో ప్రజావైద్యశాల ప్రారంభించారని తెలిపారు.

ఉపకారానికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో 2019 నుంచి 2022 వరకు సంవత్సరాల వారీగా ఎంపికైన విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాతో ఆధార్ నంబరును విధిగా అనుసంధానం చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ ద్వారా ఎంపికై 9,10,11,12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు, రెన్యూవల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తమ మెరిట్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సంబంధిత బ్యాంకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆధార్ సీడింగ్ అయిన బ్యాంకు ఖాతాలోనే డీబీటీ పద్ధతిలో ఉపకార వేతనాన్ని జమ చేస్తారని, ఆధార్ అనుసంధానం కానీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాబోవని స్పష్టం చేశారు. ఉపకార వేతన స్థితి విద్యార్థి లాగిన్ ద్వారానే తెలుస్తుందని, ఈ విషయమై తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తప్పనిసరిగా అందరూ నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని సెంటర్లపై, కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ నిలిపివేయబడతాయని వెల్లడించారు. కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

బాపట్ల టౌన్: రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాపట్ల స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన షేక్ సమ్మర్ (45) కాంట్రాక్ట్ పద్ధతిలో పూరి– తిరుపతి రైలులో మొబైల్ క్యాటరింగ్‌లో పని చేస్తూ ఉంటారు. తెనాలి నుంచి ఒంగోలు వెళుతున్న సమయంలో రైలు కిందపడి మృతి చెందాడు. పూరి నుంచి తిరుపతి వెళుతున్న రైలు బాపట్ల రైల్వే స్టేషన్‌లో ఎక్కువ సమయం ఆగేసరికి పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లినట్లు తెలిసింది. రైలు కదిలే సమయంలో షేక్ సమ్మర్ ఎక్కుతుండగా కాలు జారి ట్రైన్ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.